క్లుప్తంగా

రైతులు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలి

శావల్యాపురం: ఖరీఫ్ సాగుకు రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు సోమవారం కోరారు. స్థానిక రైతుభరోసా కేంద్రంలో మాట్లాడుతూ విత్తనాలు సంచులు సరైనా సీలుతో ధ్రువీకరణ పత్రంతో ఉన్న వాటినే మాత్రమే కొనుగోలు చేయాలన్నారు.

అనారోగ్యంతో వీఓఏ మృతి

బొల్లాపల్లి: వెలుగు పథకంలో వీఓఏ ఎ.సుబ్బలక్ష్మి(40) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. వెల్లటూరు గ్రామంలో దీప గ్రామైక్య సంఘం వీఓఏగా 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారు. మృతికి ఏపీఎం పి.వి.రంగారెడ్డి సంతాపం తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ట

బొల్లాపల్లి: మండలంలోని హనుమాపురంలో పోలేరమ్మ దేవత, పోతురాజు స్వామి, శిఖర కలశ విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. మల్లికార్జున స్వామి వేదపండితుల మంత్రోచ్చరణతో విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలేరమ్మ దేవత చల్లని దయతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు కళకళలాడాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు బి.సోమ్లానాయక్, ఎం.బాలానాయక్, బి.శ్రీనునాయక్ పాల్గొన్నారు.

10న పిచికలపాలెంలో ప్రతిష్ట

శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెంలో నూతన దేవాలయాలు ప్రతిష్ట ఈనెల 10వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా పూజ కార్యక్రమాలు ఎనిమిదో తేదీ నుంచి ప్రారంభం అవుతాయన్నారు.

విద్యార్థులకు నగదు పంపిణీ

చిలకలూరిపేటటౌన్: విద్యతోనే భావి భవిష్యత్ బంగారుమయం అవుతుందని శ్రీ విద్య మిత్రమండలి అధ్యక్షురాలు మర్రి లలిత చెప్పారు. ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులకు శ్రీ విద్య మిత్రమండలి తరుపున నగదు పురస్కారాలు పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో సోమవారం అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులు 16 మందికి ఒక్కొక్కరికి రూ. 5 వేలు, నియోజకవర్గ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థిని షణ్ముఖ అమ్మాజీకి రూ.10 వేలు, రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన మర్రి జాహ్నవికి రూ. 10 వేలు మొత్తం రూ.లక్ష అందజేశారు. అనంతరం మర్రి జాహ్నవిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు మర్రి లలిత మాట్లాడుతూ సంస్థ గత కొన్ని సంవత్సరాలుగా పేదవిద్యార్థులకు చేయూత అందిస్తుందని, విద్యార్థులు ఆర్థిక సమస్యల వైపు దృష్టి సారించకుండా చదువుమీద శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బొప్పూడి నాగలక్ష్మి, కోశాధికారి ఎం. కృష్ణకుమారి, సభ్యులు ఉష, శేషమ్మ, లక్ష్మీ, పూర్ణకుమారి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట కమిషనర్‌గా రామ్మోహన్



నరసరావుపేట: మున్సిపల్ కమిషనర్‌గా ఎం.రామ్మోహన్ సోమవారం సాయంత్రం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో కాకినాడ జిల్లా పిఠాపురం పురపాలక సంఘ కమిషనర్‌గా పనిచేస్తున్న రామ్మోహన్ నరసరావుపేట కమిషనర్‌గా నియమితులయ్యారు. ఇన్‌చార్జి కమిషనర్, మున్సిపల్ డీఈ ఓలేటి శ్రీనివాసరావు నుంచి చార్జిని స్వీకరించారు.

11న ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

రొంపిచర్ల: మండలంలో ఏపీ మోడల్ స్కూల్ అండ్ కళాశాలలో ఈ నెల 11న 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.రవినాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి హాల్ టికెట్లు విడుదల చేశామన్నారు. 6వతరగతి ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు హాల్ టికెట్లను ఈ రోజు నుండి apmr.apcfrr.i n వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచామన్నారు. అదే విధంగా 10 తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో ప్రవేశం కోసం 7లోగా apmr.apcfrr.in అనే వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే బీసీ, ఇడబ్ల్యూఎస్, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులు 200 రూపాయలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు రూ.150 దరఖాస్తు రుసుంగా చెల్లించాలని అన్నారు. పదో తరగతి విద్యార్థులు మెరిట్ మార్కులు, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం విద్యార్థుల ఎంపిక జరుగుతుందని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆఫ్‌లైన్ లో సీటు ఇవ్వడం కుదరదని అన్నారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ హితులు కావాలి

- పిలుపునిచ్చిన జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు, ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ
- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- ర్యాలీ నిర్వహించిన ఉద్యోగులు



శిక్షణ పొందిన వారికి ఆఫర్ లెటర్లు అందజేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

నరసరావుపేట: పర్యావరణాన్ని అందరూ పరిరక్షించి పరిరక్షణహితులుగా మారాలని జిల్లా యంత్రాంగం పిలుపునిచ్చింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ట్రైనింగ్ సెంటర్ ముందు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు, ట్రైనీకలెక్టర్ కేఆర్ కల్పశ్రీ పాల్గొని మొక్కలను నాటారు. అలాగే శిక్షణ పొందిన అభ్యర్థులకు గ్రీన్‌టెక్‌లో వచ్చిన జాబ్ ఆఫర్ లెటర్లను అందజేశారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సంజీవరావు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించకుంటే పెనుముప్పు

యడ్లపాడు: పర్యావరణాన్ని పరిరక్షించుకోకుంటే మానవ మనగడకే పెనుముప్పు అని ఎంపీపీ పిడతల ఝాన్సీ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. యడ్లపాడు మండల మండల సమాఖ్య, మండల పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ముందుగా పర్యావరణ హితం గురించి తెలిపే ఫ్లకార్డులను పట్టుకుని గ్రామంలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఇంధన పొదుపు, నీటి పరిరక్షణ, నో ప్లాస్టిక్, సుస్థిర ఆహార విధానం, వ్యర్థాల తగ్గింపు, ఆరోగ్యకర జీవనం, ఈ వ్యర్థాలు తగ్గింపు వంటి అంశాలపై అధికారులు ప్రసంగించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ కారుచోల హేమ, ఎంపీటీసీ సభ్యులు కీర్తి అరుణ్‌కుమార్, తహసీల్దార్ ఎస్ నాగ మల్లేశ్వరరావు, ఎంపీడీవో వై.హనుమారెడ్డి, ఈవోపీఆర్‌డీ బృందావనం వరూధిని, ఐసీడీఎస్ సీడీపీవో జి శాంతకుమారి, ఏపీఎం జీవన్, సీసీలు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షణ చేయాలని తహసీల్దారు షేక్ జాన్ సైదులు సూచించారు. సోమవారం స్థానిక గ్రామ సచివాలయంలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంపై అన్నీ శాఖల అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దారు మట్లాడుతూ భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పర్యావరణాన్ని కాపాడదాం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచి యాగసిరి చెన్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు పోతురాజు, మండల కో ఆప్షన్ సభ్యులు దూదెకుల హుసేన్, ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య, ఈఓపీఆర్‌డీ పి.సుగుణ, కార్యదర్శి డి.రవీంద్రబాబు పాల్గొన్నారు.

వినుకొండలో....

వినుకొండ టౌన్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కౌన్సిలర్ షేక్ షకీలా పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా లోకల్ టూ గ్లోబల్ అంతర్జాతీయ కార్యక్రమం ద్వారా టీడీహెచ్ జర్మనీ అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ, ఆర్ఎల్‌హెచ్‌పీ మైసూర్ వారి తోడ్పాటుతో స్థానిక స్వచ్ఛంద సేవాసంస్థ హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సహకారంతో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పురవీధుల్లో పర్యావరణ పరిరక్షణ ఫ్లకార్డ్స్ చేతబూని ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని శివయ్య స్థూపం సెంటర్లో మానవహారంగా ఏర్పడి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరుతూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ సాంబశివరావు పాల్గొన్నారు.



యడ్లపాడులో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

మేనిఫెస్టో పేరుతో చంద్రబాబు మోసం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- కరవు కాటకాలకు అంబాసిడర్ చంద్రబాబు
- ఆంధ్ర ప్రజలను మరోమారు మోసం చేసేందుకు చంద్ర బాబు సిద్ధం
- జీవీ.. నీచ రాజకీయాలు మానుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): ప్రతిపక్షనేత చంద్రబాబు మినీ మేనిఫెస్టో పేరుతో ప్రజలు మోసం చేసేందుకు మరోమారు సిద్ధమయ్యారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలనే కాపీ కొట్టి మళ్లీ ఆంధ్ర ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు గతంలో ఇలాంటి పథకాలు ఎందుకు అమలు చేయలేకపోయారని ప్రశ్నించారు. చంద్రబాబు మేనిఫెస్టో పేరుతో చేస్తున్న డ్రామాలను పచ్చ మీడియా సహకారంతో మళ్లీ అధికారంలోకి వచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఒక నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలవలేని లోకేష్, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయడం అనేది కలేనన్నారు. చంద్రబాబు పేరువినగానే గుర్తుకు వచ్చే ఒక్క పథకం కూడా అమలు చేయలేకపోయారని రైతు రుణమాఫీ పేరుతో రైతును నిండాముంచారని ఆరు వందల హామీలు ఇచ్చి అమలు చేయలేని నాయకుడు చంద్రబాబేనని అన్నారు. మహానేత రాజశేఖరరెడ్డి పేరు చెబితే రుణమాఫీ, ఉచిత కరెంట్, ఆరోగ్యశ్రీ, 108, వంటి ఎన్నో పథకాలు గుర్తుకు వస్తాయని, జగన్ పేరు చెబితే అమ్మఒడి, నాడు నేడు, విద్యాదీవెన, వసతి దీవెన వంటి ఎన్నో పథకాలు గుర్తుకు వస్తాయన్నారు. చంద్రబాబు పేరు వినగానే కరవు, కాటకాలు, ఎండిపోయిన నదులు గుర్తుకు వస్తాయని విమర్శించారు. ప్రజలు మీ పరిపాలన మరచిపోలేదని ఈసారి ఎన్నికల్లో 23 సీట్లు కూడా రావని చెప్పారు. విద్యుత్ బిలులు పెంచి అదేమని అడిగిన ప్రజలను కాల్చి చంపిన ఘతన చంద్ర బాబుదే నన్నారు. టీడీపీ హయాంలో వేసిన రోడ్లకు కూడా తామే బిల్లులు ఇచ్చామని గుర్తుచేశారు.

జీవీవి నీచ రాజకీయాలు

వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కనీసం వినుకొండకు తాగునీరు కూడా ఇవ్వలేకపోయారని నీచమైన పదజాలంతో విమర్శలు చేయడం తప్ప ఏమీ చేతగాని వాడన్నారు. జీవీ పేరు చెబితే ఏమీ చేయలనేని ఎమ్మెల్యేగా గుర్తింపు పొందాడని, ఇప్పటికీ మట్టి, ఇసుక, రేషన్ బియ్యం అమ్ముకుంటుంది మీపార్టీ నాయకులేనని ఇసుక అమ్ముకోవాల్సిన పరిస్థితి తమకు లేదన్నారు. నకిలీ కంపెనీలు పెట్టి ఎరువులకు బదులు మట్టి అమ్మి ఎంతో మంది రైతుల ఉసురు తీశారని గుర్తు చేశారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని ఇప్పటికైనా మాట తీరు మార్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ వెంకట్రామిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల వెంటేశ్వర్లు యాదవ్, మాజీ చైర్మన్ గంధంబాలిరెడ్డి ములకా రామతులసిరెడ్డి, కౌన్సిలర్ షకీల దస్తగిరి మండల కన్వీనర్ దండు చెన్నయ్యలతోపాటు పలువురు పాల్గొన్నారు.

రైతు సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



రైతు సమ్మేళనం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

చిలకలూరిపేట: ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి రైతు సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ నాయకులు కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఈ నెల 13 నుంచి 15 వరకు నరసరావుపేటలో నిర్వహించే రైతు సమ్మేళనం కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 15 వరకు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావు పేటలోని ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెట్టే దుర్మార్గానికి పూనుకుందని విమర్శించారు. ఈ నేపథ్యంలో రైతన్నకు మద్దతుగా శక్తివంతమైన రైతాంగ ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రైతు సమ్మేళనంలో రైతు సంఘ నాయకులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన, బ్యాంకింగ్ రంగ నిపుణులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, నియోజకవర్గ అధ్యక్షుడు చంద్ర రామ్మోహన కొండలరావు, సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామ సుబ్బాయమ్మ, పట్టణ కార్యదర్శి పేలూరి రామారావు, నాయకులు నాయుడు శివకుమార్, ఆరాధ్యుల రామకృష్ణ పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి.. పింఛను అందించి...

నాదెండ్ల: పింఛన్ల పంపిణీ 97.5 శాతం పూర్తి చేశారు. మొత్తం 9274 మంది లబ్ధిదారులకు గాను రూ.2,55,75,250 పంపిణీ చేయాల్సి ఉండగా, చివరిరోజు సోమవారం నాటికి 97.5 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. ఇర్లపాడు గ్రామానికి చెందిన వృద్ధాప్య పింఛను లబ్ధిదారు యన్నం సాంబయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలుకు దెబ్బతగలటంతో వైద్యులు కాలును తొలగించారు. నరసరావుపేట ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వలంటీర్ మంగు కోటేశ్వరరావు అక్కడకు వెళ్లి పింఛన్ అందించాడు.

ఉద్యోగ విరమణ వయసు పెంచాలి



నరసరావుపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకులు కోరారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయంలో డీసీఓ నాగ శ్రీనివాస్ సోమవారం అందజేశారు. ఉద్యోగులందరికీ 2019 నుంచి వేతన బకాయిలు చెల్లించాలని, జీఓ 36ను వెంటనే అమలు చేయాలని, డీసీసీబీ ఉద్యోగుల మాదిరిగానే పీఏసీఎస్ ఉద్యోగులకు కూడా సమాన డీఏ చెల్లించాలని, గ్రాట్యుటీని రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, పదవీ విరమణ వయస్సు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాలిమేర వెంకట్రెడ్డి, కన్యదారి కోటేశ్వరరావు, పోక కోటేశ్వరరావు, కంటు శ్రీనివాసరావు, రామాంజనేయులు, సుధాకరరెడ్డి, రహీం పాల్గొన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

నాదెండ్ల: అర్హులైన కౌలు రైతులు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్ఐ షేక్ రమీజా కోరారు. మండలంలోని ఎండుగుంపాలెంలో కౌలు రైతుల గుర్తింపు కార్డుల మంజూరు కోసం గ్రామ సభ సోమవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అర్హులైన రైతులు వీఆర్వోలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అయితే దరఖాస్తు చేసుకున్న కౌలు రైతులు యజమాని భూ హక్కు పత్రాలతో పాటూ ఆమోద పత్రం, ఆధార్ కార్డు తదితర వివరాలు అందించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఆనంద్, ఏఓ హరిప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలి



శిబిరంలో పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: గ్రామాలలో ఉచిత వైద్యశిబిరాల ద్వారా మెరుగైన వైద్యాన్ని అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక లైబ్రరీ సెంటర్‌లో ఆదివారం రాత్రి వేద వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిభిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో వేద హాస్పిటల్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించటం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య శిభిరాలు నిర్వహించి ప్రజలకు అన్ని రకాల వైద్యసేవలు అందించాలన్నారు. వైద్య శిబిరం నిర్వహించిన డాక్టర్ క్రాంతికుమార్ రెడ్డిని ఆయన అభినందించారు. డాక్టర్ గోపిరెడ్డి కొంత మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అన్ని రకాల పరీక్షలను నిర్వహించి రోగ నిర్ధారణ చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్‌లు గెల్లి చిన్నకోటిరెడ్డి, పడాల చక్రారెడ్డి, పలువురు నాయకులతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

చిలకలూరిపేట: నిరుపేదలకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అసిస్ట్ సేవా సంస్థ డైరెక్టర్ జాష్టి రంగారావు చెప్పారు. అసిస్ట్, కేఎస్‌ఏ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని సుభాని నగర్‌లో 250 మంది ఒంటరి మహిళలకు రూ.5లక్షలు విలువ చేసే నిత్యావసరాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎస్‌ఏ ఫౌండేషన్ ఏడాది పాటు ఒంటరి మహిళలకు నిత్యావసరాలు అందజేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసిస్ట్ అసోసియేట్ డైరెక్టర్ జాష్టి కృష్ణ హరీష్, విష్ణుప్రియ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీవారు అభయం



సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లోని అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ దైవం శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారికీ విశేషంగా జ్యేష్ఠ మాసం, శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీవారి జ్యేష్ఠ స్నపన తిరుమంజనం సోమవారం శోభాయమానంగా జరిగింది. శ్రీవారి ఆలయంలోని గరుడల్వార్ మండపంలో శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారికీ రెండు గంటల పాటు జరిగిన స్నపన తిరుమంజనంలో కురువేరు, తెల్లపట్టు, రంగురంగుల ఎండుఫలాలు, వట్టివేరు, పసుపు రోజామాలలను శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారికి అలంకరించారు. ఆచార్య శ్రీమాన్ శ్రీ చిత్రకవి శ్యాము ఆచార్యులు రామానుజ దాసన్, శ్రీసూక్తం, భూసూక్తం, పురుష సూక్తం, నీలా సూక్తం, నారాయణసూక్తాలను పఠిస్తుండగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో ఉత్సవమూర్తులకు విశేషంగా అభిషేకం చేపట్టారు. అనంతరం రైల్వేస్టేషన్ పుర విధులలో మంగళ వాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ గరుడ వాహనంపై శ్రీవారు భక్తులకు అభయప్రదానం చేశారు. ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వ హించారు.

ఘనంగా ప్రతిష్టా మహోత్సవాలు



నరగాయపాలెంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



గణపవరంలో మూలమూర్తులకు అభిషేకాలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

వినుకొండ(నూజెండ్ల): మండల పరిధిలోని నరగాయపాలెం సమీపంలో నూతనంగా నిర్మించిన దాస ఆంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 7వ తేదీ వరకు నిర్వహించే మహోత్సవంలో తొలి రోజు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెంది ఖండవల్లి విజయసారథి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వరరావు, వెంకట నారాయణరెడ్డి, చిరుమామిళ్ల కోటేశ్వరరావు, కంకణంపాటి రాజారావు, రాములు, కృష్ణకిషోర్, వీర బ్రహ్మచారి పాల్గొన్నారు.

రేపు గణపవరం రానున్న చినజీయర్‌స్వామి

నాదెండ్ల: గణపవరంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. జై శ్రీరామ్ జండాలతో గ్రామ వీధులు కాషాయ శోభ సంతరించుకున్నాయి. గణపవరంలో భారీ వ్యయంతో నిర్మించిన రామాలయంలో ఈ నెల 7న విగ్రహ, కలశ, జీవధ్వజ స్తంభ ప్రతిష్ట నిర్వహించనున్నారు. ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా సోమవారం మూలమూర్తులకు క్షీరాభిషేకం, శాంతిహోమాలు నిర్వహించారు. టీటీడీ వేదపాఠశాల అధ్యాపకులు శ్రీనివాస దీక్షితులు బృందం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ నెల 3వ తేదీ నుంచి 6 వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో వివిధ హోమాలు జరుగుతున్నాయి. విగ్రహాలకు పూజలు, అభిషేకాలు జరిపారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. 25 మంది దంపతులు పీటలపై కూర్చుని హోమాలు నిర్వహించారు. ఆలయం వద్ద త్రిదండి చినజీయర్ స్వామి శిష్యులైన గుదిమెళ్ల కూర్మనాథస్వామి శ్రీరామాయణం ప్రవచనం నిర్వహించారు. కుంభారాధన, అగ్నిప్రతిష్ట, విశేష హోమాలు చేపట్టారు. ఆలయం, యాగశాల, వీధుల్లో విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఉదయం 7.43 గంటలకు జరిగే ప్రతిష్టా కార్యక్రమానికి త్రిదండి చినజీయర్ స్వామి హాజరుకానున్నారు. కమిటీ సభ్యులు భారీ అన్నదాన ఏర్పాట్లు చేస్తున్నారు.

యల్లమందలో పూర్వ విద్యార్థుల భేటీ



నరసరావుపేట రూరల్: మండలంలోని యల్లమంద గ్రామంలో గల జెడ్పీ హైస్కూలులో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. స్కూలులో 1988 నుంచి 92 వరకు ఏడవ తరగతి నుంచి పదోతరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థినీ విద్యార్థులు సమావేశమై అప్పటి అనుభూతులను గుర్తుచేసుకున్నారు. సమావేశానికి స్థానికంగా ఉన్న వారితో పాటు ఆమెరికాలో స్థిరపడిన ముప్పాళ్ల వేణు, సింగపూర్‌కు చెందిన కొనసాని రామచంద్రారెడ్డి, ముంబాయిలోని కొనసాని చెన్నారెడ్డితో కలిపి 54 మంది హాజరయ్యారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి అప్పటి ఎస్పీఎల్ విద్యార్థి నాయకుడు షేక్ నబీబాజీ అధ్యక్షత వహించారు. మొక్కలు నాటి స్కూలులో లైబ్రరీ, సరస్వతీ దేవి విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని నిర్ణయించారు. విద్యాబుద్ధులు నేర్పిన ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, ఉపాధ్యాయురాలు సుశీల, డ్రిల్ మాస్టర్ సుబ్బారావులను ఘనంగా సన్మానించారు.

బడివయస్సు పిల్లలను కచ్చితంగా బడికి పంపాలి

సత్తెనపల్లి: బడివయస్సులో పిల్లలను కచ్చితంగా బడికి పంపాలని, ఎట్టిపరిస్థితుల్లోనూ బాల కార్మికులుగా మార్చవద్దని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ డి. నాగ వెంకటలక్ష్మి సూచనల మేరకు బాలకార్మిక వ్యవస్థను అరికట్టేందుకు నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా పట్టణంలోని 11వ వార్డు, 12 వార్డుల పరిధిలోని 14వ సచివాలయంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, షేక్ అల్లాబక్షు పాల్గొన్నారు.

ఐదు కుటుంబాలకు నగదు పంపిణీ

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలో పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఐదుగురికి జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. ఇటీవల ప్రమాదంలో చనిపోయిన డ్రైవర్ శ్రీను, ఎస్సీకాలనీకి చెందిన కట్టా పేరయ్య, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న కొత్తూరు వాసి కోటి లింగాచారి, రోడ్డు ప్రమాదంలో గాయపడిన కామిని గోపీ కుటుంబాలను ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా సందర్శించారు. అనంతరం ఆయా కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున మొత్తం రూ.50 వేలను అందించారు. కార్యక్రమంలో చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, జాలాది సుబ్బారావు, బి వి రెడ్డి,గొంటు శ్రీనివాసరెడ్డి, మానుకొండ శేషిరెడ్డి, కరీమ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు

వావిలాల్ నగర్‌లో చోరీ

సత్తెనపల్లి: పట్టణంలోని 31వ వార్డు వావిలాల్ నగర్ లో తాళ్ళాలు వేసి ఉన్న గృహంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దీనిపై పట్టణం పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. 31వ వార్డు వావిలాల్ నగర్‌కు చెందిన బూతుకూరి గోవర్ధన వైద్యశాలలో పని చేస్తుంది. భర్త వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంటికి తాళాలు వేసి ఉండగా గుర్తు తెలియని దుండగులు ఇనుప గేటును పగలగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ. 50 వేలు విలువచేసే 12 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి పట్టీలు అపహరించుకు పోయారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ

సత్తెనపల్లి: చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈనెల 19న పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి చేనేత కార్మికులంతా తరలిరావాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని చేనేత సొసైటీ బిల్డింగులో సోమవారం జరిగిన చేనేత కార్మిక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ చేనేత కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సదస్సులో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం, జిల్లా కమిటీ సభ్యులు పంతంగి ప్రభాకర్, గడ్డం సుసులోవ్, బిట్ర పానకాలు, దిబ్బయ్య, ఎం.బాబురాజు, నాగలక్ష్మి, వీవర్స్ మంచి మల్లేశ్వరి, మునిని భారతి, కాకుమాను జోజి, మోపర్తి శాంతారావు, చావా చతారి పాల్గొన్నారు.